సాక్షి
భద్రాద్రి కొత్తగూడెం
గురువారం । 23 । మార్చి । 2023



రాజ్యాంగంపై దాడి
కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రాజ్యాంగంపై దాడికి ప్రయత్నిస్తోందని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం అన్నారు. 8లో



రేషన్ బియ్యం స్వాధీనం
టేకులపల్లి మండలంలో టాస్క్‌ఫోర్స్, బోడు పోలీసులు దాడులు నిర్వహించి 73 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం
32° / 22°

వాతావరణం
జిల్లాలో గురువారం పగటి ఉష్ణోగ్రతలు అధికంగానే ఉంటాయి. రాత్రి పూట వాతావరణం కొంత చల్లబడుతుంది.

న్యూస్‌రీల్

26న మహిళా క్రికెట్ ఎంపికలు

ఖమ్మం స్పోర్ట్స్: ఉమ్మడి జిల్లాస్థాయిలో ప్రతిభ కలిగిన మహిళా క్రికెటర్లను ఎంపిక చేసేందుకు ఈనెల 26న పోటీలు నిర్వహిస్తున్నట్లు క్రికెట్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి సీహెచ్.వెంకట్, ఖమ్మం జిల్లా కోఆర్డినేటర్ ఎం.డీ.మసూద్ పాషా తెలిపారు. ఖమ్మం సర్దార్ పటేల్ స్టేడియంలో జరిగే ఎంపిక పోటీల్లో 25మందిని ఎంపిక చేసి మూడేళ్ల పాటు స్కాలర్‌షిప్ అందజేయడమే కాక ఉచిత క్రికెట్ శిక్షణ ఇస్తామని పేర్కొన్నారు. భారత క్రికెట్ జట్టు మాజీ కోచ్‌లు రవిశాస్త్రి, అరుణ్, శ్రీధర్ నేతృత్వాన హిందుస్థాన్ యూనీలివర్ లిమిటెడ్ సహకారంతో 'బియాండ్' ప్రోగ్రాం పేరిట ఈ శిక్షణ ఉంటుందని తెలిపారు. ఆసక్తి ఉన్న మహిళా క్రికెటర్లు వయస్సు ధృవీకరణ పత్రం, ఆధార్‌కార్డుతో 26న ఉదయం 8గంటలకు స్టేడియంలో రిపోర్టు చేయాలని, వివరాలకు 79818 81095 నంబర్‌లో సంప్రదించాలని వారు సూచించారు.

ఖమ్మం పాత మున్సిపాలిటీలో పీఎఫ్ కార్యాలయం

ఖమ్మం సహకారనగర్: ఖమ్మంలోని పాత మున్సిపాలిటీ కార్యాలయంలో ఎంప్లాయీస్ ప్రావిడెంట్ ఫండ్ ఆర్గనైజేషన్(ఈపీఎఫ్ఓ) కార్యాలయం ఏర్పాటుచేసినట్లు శాఖ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫీసర్ ఎం.డీ.సలీంఖాన్ తెలిపారు. ఖమ్మం, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాల్లోని సంస్థల యజమాన్యాలు, ఉద్యోగులు, పెన్షనర్లు ఈ మార్పును గమనించాలని ఆయన ఓ ప్రకటనలో కోరారు.

సస్యరక్షణ చర్యలు చేపట్టాలి

సూపర్‌బజార్(కొత్తగూడెం): జిల్లాలో ఐదు రోజుల పాటు కురిసిన భారీ వర్షాలతో పలు ప్రాంతాల్లో పంటలు దెబ్బతిన్నాయని, మిగిలిన పంటలను కాపాడుకునేందుకు రైతులు సస్యరక్షణ చర్యలు పాటించాలని కొత్తగూడెం కృషి విజ్ఞాన కేంద్రం అధికారులు సూచించారు. ఈ మేరకు ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ వి.నారాయణమ్మ, వాతావరణ శాస్త్రవేత్త వింధ్య, పర్యవేక్షకులు సుమన్ బుధవారం ఒక ప్రకటనలో రైతులకు సలహాలు, సూచనలు చేశారు. వర్షం కురిసిన ప్రాంతాల్లో పొలం నుంచి నీటిని బయటకు పంపించాలని, ఆరుతడి పంటలు త్వరగా కోలుకోవడానికి 2 శాతం యూరియా లేదా 1 శాతం పొటాషియం నైట్రేట్ ద్రావణాన్ని పంటపై పిచికారీ చేయాలని తెలిపారు. వర్షాలు పూర్తిగా తగ్గిన తర్వాత పై పాటుగా ఎకరానికి 20 కిలోల యూరియా వేసుకోవాలని సూచించారు. వర్షాలతో నేల వాలిన మొక్కజొన్న పంటను పైకి లేపేందుకు ప్రయత్నించవద్దని, కంకి పక్వానికి వచ్చి గింజలు ముదిరితే తక్షణమే కంకులను కోసి ఎండకు ఆరబెట్టాలని వివరించారు. తద్వారా కంకులు, గింజలు రంగు మారకుండా, బూజు పట్టకుండా ఉంటాయని పేర్కొన్నారు.

అన్నదాత ఏరువాక..



బూర్గంపాడులో పొలం దున్నుతున్న రైతు

బూర్గంపాడు: ఉగాది రోజున రైతులు ఏరువాకతో సాగుకు శ్రీకారం చుట్టారు. ఎద్దులను శుభ్రంగా కడిగి రంగులతో అలంకరించి అరకలు దున్నారు. మరి కొందరు ట్రాక్టర్లతో వ్యవసాయ పనులు ప్రారంభించారు. పండితుల వద్ద పంచాంగం చూపించుకుని, కుటుంబంలో ఎవరి పేరుతో సాగు ప్రారంభిస్తే బాగుంటుందనే వివరాలు తెలుసుకున్నారు. జిల్లాలోని పలువురు రైతులు అనాదిగా ఈ విధానాన్నే పాటిస్తున్నారు.

రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలి



మాట్లాడుతున్న కృష్ణ

మణుగూరు రూరల్ : ఏప్రిల్ 2,3 తేదీల్లో కొత్తగూడెంలో జరిగే ఇఫ్టూ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర అధ్యక్షుడు అరెల్లి కృష్ణ కోరారు. మణుగూరు ఏరియాలోని పలు విభాగాల వద్ద జరిగిన ప్రచార సమావేశాల్లో ఆయన మాట్లాడారు. సభకు కాంట్రాక్ట్ కార్మికులు అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు. ఇఫ్టూ పోరాటాల వల్లే కాంట్రాక్ట్ కార్మికులకు బ్యాంక్ వేతనాలు, సీఎంపీఎఫ్, ఎనిమిది గంటల పని విధానం వంటివి సాధ్యమయ్యాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్‌సీసీడబ్ల్యూయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహమ్మద్ రాసుద్దీన్, బ్రాంచ్ కార్యదర్శి మంగీలాల్, మోటార్ వర్కర్స్ యూనియన్ నాయకులు కే వాసు, వీర్రాజు, సాంబశివరావు, శివ, గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

వేడుకలు షురూ..



గోవిందరాజు స్వామి ఆలయంలో మృత్యంగ్రహణ పూజలు చేస్తున్న అర్చకులు

భద్రాద్రి రామాలయంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం

- తిరుకల్యాణ, పుష్కర పట్టాభిషేక మహోత్సవాలకు అంకురార్పణ
- అర్చక స్వాములకు దీక్షా వస్త్రాలు అందజేత
- ఆలయ వేదపండితులచే పంచాంగ శ్రవణం
- రామయ్య ఆదాయం 11, వ్యయం 08

భద్రాచలం: దక్షిణ అయోధ్యగా పేరు గాంచిన భద్రాచలం శ్రీ సీతారామచంద్రస్వామి వారి దేవస్థానంలో వసంత పక్ష ప్రయుక్త నవాహ్నిక శ్రీరామనవమి తిరుకల్యాణ బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తిరుకల్యాణోత్సవాలతో పాటు ఈనెల 31న జరిగే పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక మహోత్సవాలకు కూడా అంకురార్పణ చేశారు. ఉదయం మూలమూర్తుల వద్ద ఉత్సవ అనుజ్ఞ తీసుకున్న తర్వాత శ్రీ సీతాలక్ష్మణ సమేతుడైన రామచంద్ర స్వామి వారి ఉత్సవ మూర్తులను చిత్రకూట మండపానికి తీసుకొచ్చారు. మొదట ఓంకార ధ్వజారోహణం జరిపి, ఉత్సవ మూర్తులకు ఉత్సవాంగ స్నపనం నిర్వహించారు. ఆ తర్వాత విశ్వక్సేనపూజ, పుణ్యాహవాచనం, రక్షా బంధనం గావించారు. అనంతరం ఆలయ ఏఈవోలు శ్రవణ్‌కుమార్, భవానీ రామకృష్ణ రామాయణ పారాయణదారులకు, ఆచార్య, బ్రహ్మ, రుత్విక్‌లకు దీక్షా వస్త్రాలు అందజేశారు. తర్వాత మూలమూర్తులు, ఉత్సవ పెరుమాళ్లు, నిత్యకల్యాణ మూర్తులతో పాటు ఆచార్య, బ్రహ్మ, రుత్విక్‌లకు అర్చకులు దీక్షా కంకణధారణ చేశారు.

ఘనంగా మృత్యంగ్రహణం..

ఇక బుధవారం సాయంత్రం స్వామి వారి ఉత్సవ మూర్తులను కల్పవృక్ష వాహనంపై కొలువుదీర్చి తాతగుడి సెంటర్‌లోని గోవిందరాజ స్వామి ఆలయానికి తీసుకెళ్లారు. అక్కడ సేకరించిన పుట్టమట్టిని మరో వాహనంపై ఉంచి ఆలయానికి తీసుకొచ్చి ప్రత్యేక పూజలతో మృత్సంగ్రహణం నిర్వహించారు. ఈ పూజల్లో ఆలయ అర్చకులు, వేదపండితులు, అధికారులు, సిబ్బంది, భక్తులు పాల్గొన్నారు. కాగా, పుష్కర సామ్రాజ్య పట్టాభిషేక వేడుకలకు 22న, బ్రహ్మోత్సవాలకు ఈనెల 26న అంకురార్పణ చేస్తామని దేవస్థానం వారు ముద్రించిన కరపత్రాల్లో పేర్కొన్నప్పటికీ.. రెండు వేడుకలకూ బుధవారమే అంకురార్పణ చేయడం గమనార్హం.

పంచాంగ శ్రవణం చేస్తున్న గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు



స్వామివారికి ఆదాయం అధికం.. అమ్మవారికి ఖర్చు ఎక్కువ..

రామాయలంలో బుధవారం శోభకృత్ నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకుని వేపపూత పచ్చడి నివేదన చేసి భక్తులందరికీ ప్రసాదంగా పంపిణీ చేశారు. సాయంత్రం బేడా మండపంలో వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు పంచాంగ శ్రవణం చేశారు. శోభకృత్ అంటే శుభాలు కలిగిస్తుందని, దేశం సుభిక్షింగా ఉంటుందని చెప్పారు. ఇక ఈ ఏడాది రామయ్య ఆదాయం 11, వ్యయం 08, రాజపూజ్యం 05, అవమానం 04 అని తెలిపారు. సీతమ్మవారి ఆదాయం 02, వ్యయం 11 అని, రాజపూజ్యం 04, అవమానం 07గా ఉంటాయని వివరించారు.

యాగశాలలో పర్యగ్నీకరణం..

మేళతాళాలు, కోలాటాల నడుమ ఉత్సవ మూర్తులను పల్లకీ సేవగా తీసుకొచ్చి నూతనంగా నిర్మించిన తాత్కాలిక యాగశాలలలో వేంచేపు చేశారు. ఆ తర్వాత వాస్తు పూజ, వాస్తు హోమం, పర్యగ్నీకరణం జరిపారు. ఈ సందర్భంగా వేద పండితులు గుదిమెళ్ల మురళీకృష్ణమాచార్యులు మాట్లాడుతూ.. రామ మహాక్రతువు జరిగే పుష్కర, చతుర్వేద యాగశాలలో ప్రత్యేక పూజలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. 118 మంది రుత్విక్‌లు సామూహిక శ్రీరామాయణ పారాయణ హవనం, విష్ణు సహస్ర నామ పారాయణం చేస్తారని వివరించారు. చివరగా చిత్రకూట మండపంలో సామూహిక సంక్షేమ రామాయణ పారాయణం జరిపి, హారతి సమర్పించారు.



చిత్రకూట మండపంలో పూజలు చేస్తున్న అర్చకులు



స్వామివారిని యాగశాలకు తీసుకెళ్తున్న దృశ్యం

వెన్ను విరిచిన వరుణుడు

సారూ.. మా గోస చూడండి

- నేడు బోనకల్ మండలం రామాపురంలో సీఎం కేసీఆర్ పర్యటన
- పంట నష్టాన్ని పరిశీలించనున్న ముఖ్యమంత్రి
- రాత్రి పొద్దుపోయే వరకు ఏర్పాట్లలో నిమగ్నమైన కలెక్టర్, సీపీ
- అకాల వర్షాలతో ఉమ్మడి జిల్లాలో 33వేల ఎకరాలకు పైగా పంట నష్టం
- అత్యధిక నష్టం బోనకల్ మండల మొక్కజొన్న రైతులకే..

సాక్షిప్రతినిధి, ఖమ్మం: ఇటీవల నాలుగు రోజుల పాటు కురిసిన అకాల వర్షాలు జిల్లా రైతాంగంపై కోలుకోలేని రీతిలో దెబ్బతీశాయి. ఉమ్మడి జిల్లాలో అన్ని పంటలు కలిపి 33,638 ఎకరాల్లో దెబ్బతినగా.. అత్యధికంగా మొక్కజొన్నకే నష్టం వాటిల్లింది. ఈ పంట కంకి పొట్ట దశలో ఉండగా కురిసిన వర్షాలు రైతుల వెన్నువిరిచాయి. ఖమ్మం జిల్లా బోనకల్ మండల రైతాంగంపై వర్షం తీవ్రప్రభావాన్ని చూపింది. ఈమేరకు అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో గురువారం పర్యటించనున్న ముఖ్యమంత్రి చంద్రశేఖర్‌రావు బోనకల్ మండలం రామాపురంలో పరిశీలిస్తారు.

ఆవిరైన మొక్కజొన్న రైతుల ఆశలు

ఉమ్మడి ఖమ్మం జిల్లాలో ఇటీవల నాలుగు రోజుల పాటు అకాల వర్షాల ధాటికి యాసంగిలో సాగు చేసిన పంటలు దెబ్బతిన్నాయి. వర్షాలతో ఉమ్మడి జిల్లాలో 33,637 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నట్లు అధికారులు గుర్తించగా.. ఇందులో ప్రధానంగా మొక్కజొన్న పంటకే నష్టం జరిగింది. ఉమ్మడి జిల్లాలోనే అత్యధికంగా బోనకల్ మండలంలో పంట నష్టం జరగడంతో సీఎం గురువారం ఈ మండలానికి రానున్నారు. ఖమ్మం జిల్లాలో 90,602 ఎకరాల్లో మొక్కజొన్న పంట సాగు చేయగా.. వర్షాలతో 30,792 ఎకరాల్లో పంటలకు నష్టం జరిగింది. ప్రస్తుతం కంకి పొట్ట దశలో ఉండగా, మరో నెలలో చేతికందనుండగా వరుణుడు రైతుల వెన్ను విరిచాడు. అలాగే, ఇక భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని 49 గ్రామాల్లో 1,180 మంది రైతులకు చెందిన 2,599 ఎకరాల్లో పంటలు దెబ్బతిన్నాయి. ఇక్కడ కూడా అత్యధికంగా 1,062 మంది రైతులకు చెందిన 2,179 ఎకరాల్లో మొక్కజొన్న పంట చేతికి అందకుండా పోగా, 250 ఎకరాల మేర వరి పంటను 45 మంది రైతులు నష్టపోయారు.

బోనకల్ మండలంలోనే అత్యధికం

నాగార్జునసాగర్ ప్రాజెక్టు పరిధిలో సాగునీరు అందుతుందనే ఉద్దేశంతో ఈసారి బోనకల్ మండల రైతులు మొక్కజొన్న పంటకు ప్రాధాన్యత ఇచ్చారు. సాగర్ నీటి విడుదలలో ఇబ్బందులు ఎదురైనా రాత్రింబవళ్లు శ్రమిస్తూ పంటను కాపాడుకున్నారు. ఇంతలోనే వరుణుడు మొక్కజొన్నను మింగేశాడని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. బోనకల్ మండలంలోని 18 గ్రామాల్లో 7,092 మంది రైతులు 10,324 ఎకరాల్లో మొక్కజొన్న సాగు చేశారు. వర్షాల ప్రభావంతో ఈ పంట పూర్తిగా చేతికి అందకుండా పోయింది. జిల్లావ్యాప్తంగా 30,792 ఎకరాల్లో మొక్కజొన్న నష్టపోగా.. బోనకల్ మండలంలోనే 10,324 ఎకరాల్లో దెబ్బతినడం గమనార్హం. ఇక చింతకాని మండలంలోని 12 గ్రామాలకు చెందిన 4,500 మంది రైతులకు చెందిన మొక్కజొన్న 6,500 ఎకరాల్లో పాడైంది.



రామాపురానికి ముఖ్యమంత్రి

అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న పంటలను పరిశీలించేందుకు ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం జిల్లాలోని బోనకల్ మండలంలో పర్యటించనున్నారు. హెలీకాప్టర్ ద్వారా బోనకల్ మండలంలోని రామాపురం గ్రామానికి చేరుకోనున్న సీఎం.. ఈ గ్రామంతో పాటు గార్లపాడులోనూ పంట నష్టాన్ని పరిశీలించనున్నట్లు సమాచారం. ఉదయం 10.15గంటలకు హైదరాబాద్ బేగంపేట ఎయిర్‌పోర్ట్ నుంచి బయలుదేరనున్న సీఎం కేసీఆర్ 11.15గంటలకు ఇక్కడకు చేరుకుని దెబ్బతిన్న పంటలను పరిశీలించి రైతులతో మాట్లాడుతారు. సుమారు అరగంటకు పైగా సీఎం పర్యటన సాగనుండగా, ఆతర్వాత మహబూబాబాద్ జిల్లా పెద్దవంగరకు వెళ్తారని బుధవారం రాత్రి అధికారిక సమాచారం వెలువడింది. ఈమేరకు ఖమ్మం కలెక్టర్ వీ.పీ.గౌతమ్, సీపీ విష్ణు ఎస్.వారియర్ బోనకల్ మండలానికి వెళ్లి రామాపురం, గార్లపాడు, ముష్టికుంట్ల, రావినూతలలో పర్యటించి సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలించారు. అలాగే, రైతులతో మాట్లాడి పంట నష్టం వివరాలు తెలుసుకున్నారు. అకాల వర్షాలతో నష్టపోయిన తమను ఆదుకోవాలని ఈ సందర్భంగా రైతులు కలెక్టర్‌ను కోరారు.

శ్రీ దేవీ నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం

పాల్వంచరూరల్: పెద్దమ్మతల్లి ఆలయంలో ఉగాది నుంచి శ్రీరామనవమి వరకు నిర్వహించనున్న శ్రీదేవీ వసంత నవరాత్రి ఉత్సవాలు బుధవారం వైభవంగా ప్రారంభమయ్యాయి. మొదట గోపూజ చేసిన అర్చకులు.. ఆ తర్వాత గణపతి పూజ, పుణ్యావాచనం, రుత్వికరణం, దీక్షావస్త్రధారణ, అఖండ దీపారాధన, రుద్రాభిషేకం, లక్ష కుసుమార్చన తదితర కార్యక్రమాలు నిర్వహించారు. ఎమ్మెల్యే వనమా వెంకటేశ్వరరావు, పద్మావతి దంపతులు కలశ పూజ చేశారు. ఇక అర్చకులు సాయంత్రం పంచాంగ శ్రవణం నిర్వహించారు. కాగా, అమ్మవారి ఆలయ పునర్నిర్మాణానికి సారపాకకు చెందిన ముగ్గు భూలక్ష్మి రూ.5,116 వితరణగా అందజేశారని ఈఓ ఎస్.రజినీకుమారి తెలిపారు.

ఆలయంలో భక్తుల రద్దీ..

ఉగాది పర్వదినంతో పాటు దేవీ నవరాత్రి వేడుకలు ప్రారంభం కావడంతో పెద్దమ్మతల్లి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. జిల్లా నలుమూలలతో పాటు ఇతర జిల్లాల నుంచి సైతం భక్తులు భారీగా తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు. ఆయా కార్యక్రమాల్లో ఆలయ కమిటీ మాజీ చైర్మన్ మహిపతి రామలింగం, గత పాలక మండలి సభ్యులతో పాటు టీపీసీసీ జనరల్ సెక్రటరీ ఎడవల్లి కృష్ణ, బుద్ద కిషోర్, సత్యనారాయణ, చారి తదితరులు పాల్గొన్నారు.



కలశపూజ నిర్వహిస్తున్న అర్చకులు, హాజరైన ఎమ్మెల్యే వనమా దంపతులు

శుభాలు కలిగించే 'శోభకృత్'



గణేష్ టెంపుల్‌లో కలెక్టర్ అనుదీప్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు

- జిల్లాలో ఘనంగా ఉగాది వేడుకలు
- ఆలయాలు, ఇళ్లలో ప్రత్యేక పూజలు
- షడ్రుచుల పచ్చడి, పిండి వంటలతో విందు

కొత్తగూడెంటౌన్: శోభకృత్ నామ సంవత్సరం ఉగాది పండుగను బుధవారం జిల్లా వ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే ఆలయాల్లో, ఇళ్లలోని దేవుడి మందిరాల వద్ద పలువురు ప్రత్యేక పూజలు చేశారు. షడ్రుచుల మేళవింపు అయిన వేప పూత పచ్చడితో పాటు పలు రకాల పిండి వంటలతో బంధు, మిత్రులతో కలిసి విందు ఆరగించారు. సాయంత్రం ఆలయాల్లో అర్చకులు, పురోహితులు పంచాంగ శ్రవణం నిర్వహించారు. ఈ ఏడాది తమకు ఆదాయ, వ్యయాలు ఎలా ఉంటాయి.. వ్యవసాయం కలిసొస్తుందా.. వ్యాపారాలు ఎలా ఉంటాయనే వివరాల గురించి ప్రజలు పండితులను అడిగి తెలుసుకున్నారు. అయితే శోభకృత్ అంటే శుభాలు కలిగించేదని, పచ్చని పంటలతో రాష్ట్రం సుభిక్షంగా ఉంటుందని పండితులు తెలిపారు. ప్రజలకు ఆమోదయోగ్యమైన పాలన అందుతుందని చెప్పారు.

గణేష్ టెంపుల్‌లో కలెక్టర్ దంపతుల పూజలు..

ఉగాది పండుగను పురస్కరించుకొని కొత్తగూడెం గణేష్‌టెంపుల్‌లో కలెక్టర్ అనుదీప్ సతీమణి, కుమారుడితో కలిసి హాజరు కాగా, ఆలయ ఈఓ కె.సులోచన వారికి ఘనంగా స్వాగతం పలికారు. ప్రధాన అర్చకులు రాధాకృష్ణశర్మ ప్రత్యేకంగా పూజలు చేసి కలెక్టర్ దంపతులకు తీర్థప్రసాదాలు అందించారు. అడిషనల్ ఎస్పీ సాయి మనోహర్ దంపతులు శ్రీరాజరాజేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు.

శరవేగంగా 'ఆయుష్మాన్'

- చురుగ్గా రేషన్ కార్డుతో అనుసంధానం
- 2,27,805 మందికి ఈకేవైసీ పూర్తి
- ఈనెల 31 వరకు గడువు

చుంచుపల్లి: ఆరోగ్యశ్రీ పథకం తరహాలోనే ఆయుష్మాన్ భారత్‌ను అమలు చేయాలని ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. దీంతో దారిద్ర్యరేఖకు దిగువనున్న ప్రజలందరికీ రూ.5 లక్షల వరకు ఉచిత వైద్య సేవలు అందనున్నాయి. ఈ నేపథ్యంలో లబ్ధిదారులకు మెరుగైన వైద్యసేవలు అందించేలా అధికారులు ప్రణాళికలు రూపొందించారు. తెల్లరేషన్ కార్డు ఉన్న వారి వివరాలను ప్రస్తుతం ఆరోగ్యశ్రీ సిబ్బంది నమోదు చేసే పనిలో ఉన్నారు. రాష్ట్రంలో ఆరోగ్యశ్రీ పథకం ద్వారా కేవలం రూ.2 లక్షల వరకు మాత్రమే వైద్య ఖర్చులు చెల్లిస్తున్నారు. ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్‌లో విలీనంతో అదనంగా మరో రూ.3 లక్షల వరకు ప్రయోజనం కలుగుతుంది. ఈ నేపథ్యంలో గత డిసెంబర్ 29 నుంచి సంబంధిత అధికారులు ప్రజలకు అవగాహన కల్పిస్తున్నారు. జిల్లాలో రేషన్ కార్డు నంబర్‌ను ఆయుష్మాన్ భారత్‌కు అనుసంధానం చేస్తున్నారు. గ్రామాల్లో ప్రత్యేక సీఎస్ కేంద్రాల్లోనే కాకుండా ఆరోగ్య మిత్రలు ఇంటింటికీ వెళ్లి వివరాలను ఆయుష్మాన్ భారత్ యాప్‌లో అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ నెల 31వరకు గడువు విధించిన ప్రభుత్వం ఏప్రిల్ లేదా మేలో ఆయుష్మాన్ భారత్ కార్డుల పంపిణీకి ఏర్పాట్లు చేస్తోంది. ఆయుష్మాన్ భారత్ కార్డు ఉంటే దేశంలో ఎక్కడి నుంచైనా వైద్య సేవలు పొందవచ్చు. కుటుంబంలో ప్రతి ఒక్కరికీ వేర్వేరుగా ఈ కార్డులను అందజేస్తారు. ఇక చిన్నారుల నుంచి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరూ ఆయుష్మాన్ భారత్ కార్డు పొందనున్నారు. కాగా, జనవరి 19 నంచి కంటివెలుగు శిబిరాల నిర్వహణతో ఈ ప్రక్రియలో కొంత జాప్యం జరుగుతోంది.



రేషన్‌కార్డు నంబర్‌ను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేస్తున్న సిబ్బంది

జిల్లాలో 2,27,805 మంది అనుసంధానం..

నిరుపేదలకు మెరుగైన ఉచిత వైద్యం కోసం అప్పటి ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖరరెడ్డి 2004లో ఆరోగ్యశ్రీ సేవలను అందుబాటులోకి తెచ్చారు. ప్రస్తుతం తెల్లరేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరికీ ఆరోగ్యశ్రీ, ఆయుష్మాన్ భారత్ సేవలను వర్తింపజేసేందుకు ప్రభుత్వం ముందుకొచ్చింది. జిల్లాలో మొన్నటి వరకు 13 ఆస్పత్రుల్లో ఈ ఆరోగ్యశ్రీ సేవలు అందుబాటులో ఉండేవి. జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఆభా (ఆయుష్మాన్ భారత్ హెల్త్ అకౌంట్) కార్డు నమోదు కార్యక్రమాన్ని రెండు నెలల క్రితమే చేపట్టారు. ఇందుకోసం సీఎస్‌సీ ప్రత్యేక కేంద్రాల వద్ద ఆరోగ్య మిత్రలు, వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచారు. ప్రతి వ్యక్తి తప్పనిసరిగా కేంద్రం వద్దకు వెళితే సిబ్బంది మొబైల్‌లో ఫొటో తీసుకుంటారు. అనంతరం పూర్తి వివరాలు రేషన్‌కార్డు ఆధారంగా నమోదు చేసుకుంటున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 32 శాతం మేర వివరాలు నమోదు చేశారు. జిల్లాలో 2,94,817 రేషన్ కార్డుల పరిధిలో 8.56 లక్షల మందికి ఆయుష్మాన్ భారత్‌తో ప్రయోజనం చేకూరనుంది. రేషన్ కార్డుతో అనుసంధానం చేస్తుండటంతో భవిష్యత్తులో వ్యక్తికి సంబంధించి సమస్త ఆరోగ్య వివరాలు ఇందులో ఒక్క క్లిక్‌తో కనిపించనున్నాయి. ఆయుష్మాన్ భారత్‌లో 1,886 రకాల వ్యాధులకు చికిత్స అందిస్తారు. ఇందులో ప్రధానంగా మోకాళ్ల చిప్పల మార్పిడి, గుండె, కిడ్నీ మార్పిడి, కాలేయ వ్యాధులకు చికిత్సలతో పాటు పలు రకాల వ్యాధులకు శస్త్ర చికిత్సలు చేయించుకునే వీలు కల్పించారు. అలాగే ఏ రాష్ట్రంలోనైనా ఈ ఆయుష్మాన్ భారత్ సేవలు అమల్లో ఉండడంతో మెరుగైన వైద్యం పొందే అవకాశం ఉంటుంది. ఆయుష్మాన్ సేవలు అందుబాటులోకి రావడంతో జిల్లా వాసులకు మరింత ప్రయోజనం కలుగనుంది.

అందరి వివరాలను నమోదు చేస్తున్నాం



కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఆయుష్మాన్ భారత్ పథకంలో రేషన్ కార్డు ఉన్న వారి వివరాలు నమోదు చేస్తున్నాం. ఆరోగ్య శ్రీ సిబ్బంది దీని విషయంలో ఇప్పటికే ప్రజలకు అవగాహన కల్పిస్తోంది. రేషన్ కార్డు నంబర్‌ను ఆయుష్మాన్ భారత్‌తో అనుసంధానం చేస్తున్నారు. ఇప్పటివరకు జిల్లాలో 2,27,805 మందికి ఈకేవైసీ అనుసంధానం పూర్తయింది. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేసి సకాలంలో వందశాతం పూర్తి చేస్తాం.

– డాక్టర్ గోపి, ఆరోగ్యశ్రీ, జిల్లా కో–ఆర్డినేటర్

ఘనంగా కోటమైసమ్మ జాతర

పూజలు చేసిన ఎమ్మెల్యే హరిప్రియ

కామేపల్లి(కారేపల్లి): కామేపల్లి మండలం కొత్తలింగాలలోని కోటమైసమ్మ తల్లి ఆలయంలో ఏటా ఉగాది సందర్భంగా నిర్వహించే జాతర బుధవారం ఘనంగా జరిగింది. కోరిన కోర్కెలు తీర్చే తల్లిగా పేరున్న కోటమైసమ్మకు మొక్కులు చెల్లించేందుకు వివిధ జిల్లాల భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. ఈసందర్భంగా ఇల్లెందు ఎమ్మెల్యే హరిప్రియ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అలాగే, పలువురు తమ వాహనాలకు పూజ చేయించడంతో పాటు వంటలు చేసుకుని సాయంత్రం వరకు ఇక్కడే గడిపారు. గ్రామంలోని ప్రతీ ఇంటికి ఆడపడుచులు రావడంతో పండుగ వాతావరణం చోటు చేసుకుంది. కాగా, జాతరకు హాజరైన భక్తులకు డీసీసీబీ డైరెక్టర్ మేకల మల్లిబాబుయాదవ్ ఆధ్వర్యాన పులిహోర ప్రసాదం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం దేవాదాయ శాఖ ఇన్‌స్పెక్టర్ సమత, ఈఓ ఎస్.శేషగిరిరావు, ఆలయ చైర్మన్ మల్లెంపాటి శ్రీనివాసరావు, కమిటీ సభ్యులు, సిబ్బంది బి.వరప్రసాద్, కె.సత్యనారాయణ, డి.హనుమంతరావు, నాయకులు అంతోటి అచ్చయ్య పాల్గొన్నారు.

క్లుప్తంగా

క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా నాతాను


పిల్లి నాతాను

పాల్వంచ: తెలంగాణ క్రైస్తవ ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడిగా పిల్లి నాతాను ఎన్నికయ్యారు. బుధవారం మంచికంటి నగర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమావేశంలో ఈ ఎన్నిక జరిగింది. మణుగూరు మండల అధ్యక్షుడిగా కృపాదానం, అశ్వాపురం కారం రాజు, అశ్వారావుపేట దిరిశనపల్లి శ్యాం సుందర్, ములకలపల్లి సున్నం బోయజు, పాల్వంచ పోడేం శ్యాంసన్, దుమ్ముగూడెం కోడిరెక్కల జాను, భద్రాచలం కోర్స అబ్రహం, టేకులపల్లి ఏజ్జు భాస్కర్, కరకగూడెం టి.కోర్నిలి, పినపాక బి.రాజరత్నం, గుండాల జాన్ మార్క్, బూర్గంపాడు బెన్నీ, సుజాతనగర్ మండల అధ్యక్షుడిగా జాన్ కోర్నలిను ఎన్నుకున్నట్లు నాతాను తెలిపారు. క్రైస్తవుల సమస్యల పరి ష్కారానికి కృషి చేస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సూర్యాపేట జిల్లా అధ్యక్షుడు బోయాజు, తిరుమలాయపాలెం మండల అధ్యక్షుడు కృపానిధి, డాక్టర్ రవి పాల్గొన్నారు.

నేడు సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటించండి

- మావోయిస్టు చర్ల శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ

చర్ల: భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్ అమరులైన మార్చి 23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా పాటిస్తూ ఏరియా వ్యాప్తంగా నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని, సామ్రాజ్యవాద తొత్తులైన మోదీ, అమిత్‌షా దిష్టిబొమ్మలు తగులబెట్టాలని మావోయిస్టు పార్టీ చర్ల- శబరి ఏరియా కమిటీ కార్యదర్శి అరుణ పిలుపునిచ్చారు. ఈ మేరకు బుధవారం పత్రికలకు లేఖ విడుదల చేశారు. లేఖలోని వివరాల ప్రకారం... దేశంలో బ్రిటీష్ వలసవాదులకు వ్యతిరేకంగా పోరాడిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖ్‌దేవ్‌లను మార్చి 23న బ్రిటీష్ ప్రభుత్వం ఉరితీసిందని, వారి త్యాగాన్ని స్మరిస్తూ ఏటా మార్చి 23న సామ్రాజ్యవాద వ్యతిరేక దినంగా జరుపుకుంటున్నట్లు తెలిపారు. ఉక్రెయిన్ దేశ ప్రజలపై సామ్రాజ్యవాదుల యుద్ధాన్ని ఆపాలని డిమాండ్ చేస్తూ నిరసన కార్యక్రమాలు నిర్వహించాలని కోరారు. దేశంలో బీజేపీ, బీఆర్‌ఎస్ ప్రభుత్వాలు అధికారంలోకి వచ్చాక బ్రాహ్మణీయ, హిందూ మతోన్మాదాన్ని ప్రజలపై బలవంతంగా రుద్దుతున్నారని ఆరోపించారు. మోదీ, అమిత్‌షాలు అభివృద్ధి పేరుతో సంపద, వనరులను సామ్రాజ్యవాదులకు కట్టబెడుతున్నారని విమర్శించారు. చర్ల శబరి ఏరియా వ్యాప్తంగా సాగు భూములను హరితహారం, ప్రాజెక్టుల పేరుతో కబ్జా చేసి, పరిహారం చెల్లించకుండా అటవీశాఖ అధికారులను రైతులపైకి దాడులకు ఉసిగొల్పుతున్నారని ఆరోపించారు.

విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి


చిన్నవెంకటేశ్ (ఫైల్)

వేంసూరు: మండలంలోని అరిసెలపాడులో బుధవారం ఓ వ్యక్తి విద్యుదాఘాతంతో మృతి చెందాడు. గ్రామానికి చెందిన కోటమర్తి చిన్న వెంకటేశ్ (57) ఇంట్లో నీళ్ల కోసం మోటార్ ఆన్ చేస్తుండగా షాక్ కొట్టింది. దీంతో ఆయనను ఏపీలోని తిరువూరు ఆస్పత్రికి తరలిస్తుండగా గ్రామ శివారులోనే మృతి చెందాడు. ఘటనపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ సురేశ్ తెలిపారు.

ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌కు తీవ్రగాయాలు..

ఖమ్మంరూరల్: మండలంలోని తనగంపాడు, కస్నాతండా మధ్య విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ వద్ద పనిచేస్తున్న ప్రైవేట్ ఎలక్ట్రీషియన్ విద్యుదాఘాతంతో గాయపడ్డాడు. తనగంపాడుకు చెందిన బాలకృష్ణ గ్రామంలో ప్రైవేట్ ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తుండగా, పొలాల వద్ద ట్రాన్స్‌ఫార్మర్‌లో బుధవారం సాయంత్రం పోయిన ఫ్యూజ్ వేస్తున్నాడు. ఇది తెలియని ఓ రైతు బ్రేకర్ ఆన్ చేశాడు. ఈ క్రమంలో షాక్‌కు గురైన బాలకృష్ణ రెండు చేతులు, కాళ్లు కాలిపోవడమే కాక కిడ్నీ పగిలిపోయింది. దీంతో చికిత్స కోసం బాలకృష్ణను స్థానిక రైతులు ఖమ్మం ఆస్పత్రికి తరలించారు.

పందెంరాయుళ్ల అరెస్ట్

బూర్గంపాడు: మండల పరిధిలోని బుడ్డగూడేనికి సమీపంలో కోడిపందేలు నిర్వహిస్తున్న స్థావరాలపై బుధవారం టాస్క్‌ఫోర్స్ పోలీసులు దాడులు నిర్వహించారు. నలుగురు పందెంరాయుళ్లను అదుపులోకి తీసుకున్నారు. మరికొందరు అక్కడి నుంచి పరారయ్యారు. మూడు కోడిపుంజులు, ఎనిమిది బైక్‌లు, రూ.32,200 నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. పరారీలో ఉన్న వారికోసం గాలిస్తున్నారు. దొరికిన వారిని బూర్గంపాడు పోలీస్‌స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేశారు.

9 అడుగుల కొండచిలువ హతం

రఘునాథపాలెం: మండలంలోని కోయచలక సమీపాన కోయచలక–పాపటపల్లి రోడ్డులో బుధవారం తొమ్మిది అడుగుల కొండచిలువ కలకలం రేపింది. రైతులు ఉదయాన వ్యవసాయ పనులకు వెళ్తుండగా కొండచిలువ రోడ్డుకు అడ్డంగా వెళ్తుండడంతో ఆందోళనకు గురై దానిని హతం చేశారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,781

ఖమ్మం మార్కెట్‌కు హంగులు


ఖమ్మం వ్యవసాయ మార్కెట్ ముఖద్వారం

చేపట్టనున్న అభివృద్ధి పనుల వివరాలు

పని	అంచనా విలువ
యార్డుల చుట్టూ సీసీ రోడ్లు	రూ.3.12 కోట్లు
ప్రధాన యార్డులో కవర్ షెడ్లు	రూ.2.87 కోట్లు
ఆవరణలో డ్రెయిన్లు, ప్రహరీలు	రూ.2.55 కోట్లు
మార్కెట్ కమిటీ నూతన కార్యాలయం	రూ.1.20కోట్లు
టాయిలెట్లు	రూ.14 లక్షలు
మూడు ఆర్చీల నిర్మాణం	రూ.19.50 లక్షలు
యార్డుల్లో గేట్ ఎంట్రీ గదులు	రూ.18 లక్షలు
పశువుల నియంత్రణ నిర్మాణాలు	రూ.8.70లక్షలు
మొత్తం	రూ.10,34,20,000

త్వరలోనే రూ.10.34 కోట్లతో అభివృద్ధి పనులు

- వ్యవసాయ, కూరగాయల మార్కెట్లలో 15 పనులకు ప్రణాళిక
- తద్వారా రైతులకు వసతులు, మారనున్న రూపురేఖలు

ఖమ్మంవ్యవసాయం: రాష్ట్రంలోని పెద్ద వ్యవసాయ మార్కెట్లలో ఒకటైన ఖమ్మం వ్యవసాయ మార్కెట్‌కు కొత్త హంగులు సంతరించుకోనున్నాయి. వ్యవసాయ మార్కెట్‌లో అభివృద్ధి పనులకు ప్రభుత్వం వ్యవసాయ రూ.10.34 కోట్లు మంజూరు చేసింది. ఈ నిధులతో వ్యవసాయ మార్కెట్, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్లలో చేపట్టాల్సిన పనులపై ప్రణాళిక రూపొందించారు. త్వరలోనే ఈ పనులు మొదలుకానుండగా.. రైతులకు మరిన్ని వసతులు సమకూరనున్నాయి.

రాష్ట్రంలోనే ప్రత్యేకం

ఉమ్మడి ఏపీలోనే ఖమ్మం మార్కెట్‌కు ప్రత్యేక స్థానం ఉంది. స్వాతంత్ర్యానికి పూర్వం గాంధీచౌక్ సెంటర్‌గా ఏర్పాటైన బీటుబజార్ ఆ తర్వాత వ్యవసాయ మార్కెట్‌గా రూపాంతరం చెందింది. అపరాలు, మిర్చి, పత్తి పంటలకు ప్రత్యేకంగా వేర్వేరుగా మూడు యార్డులను ఏర్పాటు చేశారు. దినదినాభివృద్ధి చెందుతున్న ఈ మార్కెట్ పత్తి, మిర్చి కొనుగోళ్లలో జాతీయ, అంతర్జాతీయ స్థాయి గుర్తింపు సాధించింది. ఇక్కడ ప్రధానంగా మిర్చి, పత్తి కొనుగోళ్లు అధికంగా జరుగుతుంటాయి. ఖమ్మం జిల్లాతో పాటు, పరిసర జిల్లాలైన మహబూబాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, సూర్యాపేట, హన్మకొండ జిల్లాలే కాక పొరుగున ఉన్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని కృష్ణ, గుంటూరు జిల్లాలకు చెందిన రైతులు మిర్చి, పత్తి తీసుకొస్తారు. అలాగే, ఇక్కడి వ్యాపారులు తేజా రకం మిర్చిని చైనా, మలేషియా, సింగపూర్, థాయ్‌లాండ్, బంగ్లాదేశ్ తదితర దేశాలకు ఎగుమతి చేస్తుంటారు. ఏటా రూ.2 వేల కోట్లకు పైగా లావా దేవీలు ఇక్కడ నమోదవుతాయి. టర్నోవర్, అవసరాలను పరిగణనలోకి తీసుకున్న రాష్ట్ర ప్రభుత్వం మార్కెట్‌ను మరింతగా అభివృద్ధి చేసేందుకు నిధు లు మంజూరు చేసింది. మార్కెట్‌లోని యార్డులు, ఈ-మార్కెట్ పరిధిలో కొనసాగుతున్న ఖమ్మం బైపాస్ రోడ్డులోని హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో అభివృద్ధి పనులు చేపట్టనున్నారు. యార్డులు, హోల్‌సేల్ కూరగాయల మార్కెట్‌లో 15 రకాల పనులు చేపట్టేందుకు మార్కెట్ కమిటీ తీర్మానించించగా.. రహదారులు, డ్రెయిన్లు, ఆర్చీలు, ఇతర పనులు ఈ జాబితాలో ఉన్నాయి.

మారనున్న రూపురేఖలు

ప్రభుత్వం మంజూరు చేసిన రూ.10.34 కోట్ల పైచిలుకు నిధులతో చేపట్టే పనులతో ఖమ్మం వ్యవసాయ మార్కెట్ రూపురేఖలు మారనున్నాయి. మార్కెట్ యార్డులకు ఆర్చీల నిర్మాణం, రహదార్లు, డ్రెయిన్లతో ఇప్పటివరకు ఉన్న ఇబ్బందులు తీరనున్నాయి. అలాగే, మార్కెట్ కమిటీ కార్యకలాపాలకు నూతన కార్యాలయాన్ని నిర్మించనున్నారు. మార్కెటింగ్ శాఖకు చెందిన ఇంజనీరింగ్ విభాగం ఈ పనులను పర్యవేక్షించనుంది.

త్వరలోనే పనులు ప్రారంభిస్తాం



ప్రభుత్వం మంజూరు చేసిన నిధులతో త్వరలో పనులు ప్రారంభిస్తాం. పనులు, అంచనాలు రూపొందించడమే కాక మార్కెట్ తరఫున తీర్మానాలు చేశాం. అలాగే, టెండర్ల ప్రక్రియ కూడా పూర్తయింది. ఆయా పనులు త్వరలోనే మొదలుకానుండగా. నిర్దేశిత సమయంలో పూర్తయ్యేలా ప్రణాళిక రూపొందించాం.

–దోరేపల్లి శ్వేత, చైర్‌పర్సన్, ఖమ్మం వ్యవసాయ మార్కెట్

జమలాపురంలో బ్రహ్మోత్సవాలు ప్రారంభం



జమలాపురంలో ఉత్సవాలను ప్రారంభిస్తున్న అధికారులు, అర్చకులు (ఇన్‌సెట్) శ్రీవారి పాదానికి అభిషేకం చేస్తున్న భక్తులు

ఎర్రుపాలెం: తెలంగాణ తిరుపతిగా పేరున్న ఎర్రుపాలెం మండలం జమలాపురంలోని శ్రీవేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామునే శ్రీవారికి అర్చకులు సుప్రభాత సేవ, పంచామృతంతో అభిషేకం నిర్వహించడమే కాక స్వామి, అమ్మ వార్లను అలంకరించి వేపపూవు ప్రసాదాన్ని నివేదించారు. ఆ తర్వాత ఆలయ పుష్కరిణి నుంచి ఈఓ కె.జగన్మోహన్‌రావు, ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, అర్చకులు, సిబ్బంది మేళతాళాల నడుమ తీర్థపు బిందె, పట్టు వస్త్రాలను యాగశాలకు తీసుకొచ్చారు. అక్కడ ఉగాది సందర్భంగా అర్చకులు కురివి వెంకట సుబ్రహ్మణ్య శాస్త్రి పంచాగ శ్రవణం చేయగా.. శ్రీవారి నిత్యకల్యాణాన్ని నిర్వహించారు. కాగా, బ్రహ్మోత్సవాల తొలిరోజు ఉగాది పర్వదినం కావడంతో తెలంగాణ, ఏపీ రాష్ట్రాలకు చెందిన పది వేలమందికి పైగా భక్తులు స్వామిని దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. ధర్మకర్తలు ఉప్పల కృష్ణమోహన్ శర్మ, ఉప్పల శ్రీరామచంద్రమూర్తి, ఉద్యోగులు, అర్చకులు శ్రీనివాస్, విజయకుమారి, విజయదేవ శర్మ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా శ్రీనివాసరెడ్డి


శ్రీనివాసరెడ్డి, మనోహర్ తివారి

ఇల్లెందు: బీఆర్‌ఎస్ ఇల్లెందు పట్టణ అధ్యక్షుడిగా సింగరేణి ఉద్యోగి నాదెండ్ల శ్రీనివాసరెడ్డిని నియమించారు. బుధవారం రాత్రి ఎమ్మెల్యే హరిప్రియ ఆదేశానుసారం పట్టణ పార్టీ నేతలు కొక్కు నాగేశ్వరరావు, పరుచూరి వెంకటేశ్వరరావు, జేకే శ్రీనివాస్, మనోహర్ తివారి, గిన్నారపు రవిల చేతుల మీదుగా ఆయనకు నియామక పత్రం అందజేశారు. ఇక పట్టణ గౌరవాధ్యక్షులుగా మనోహర్ తివారిని నియమించారు. కాగా గతంలో మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కొక్కు నాగేశ్వరరావు అధ్యక్షుడిగా ఉన్నారు. ఆయన రాజీనామా చేయటంతో మూడు నెలల క్రితం ప్రస్తుత గౌరవాధ్యక్షుడు మనోహర్ తివారీని నియమించినట్లు ప్రచారం జరిగింది. కానీ తివారీకి నియామక పత్రం ఇవ్వలేదని ఇటీవల ప్రకటించిన ఎమ్మెల్యే తాజాగా శ్రీనివాసరెడ్డిని నియమిస్తున్నట్లు వెల్లడించారు. సింగరేణి ఉద్యోగి, స్థానికేతరుడైన శ్రీనివాసరెడ్డిని నియమించడంపై టీఆర్‌ఎస్ శ్రేణుల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఏఐటీయూసీలో క్రియాశీలకంగా పని చేసిన ఆయన సింగరేణి గుర్తింపు కార్మిక సంఘం ఎన్నికల ముందు టీబీజీకేఎస్‌లో చేరారు. ఉద్యోగ రీత్యా ఇల్లెందులో ఉంటున్నారు. మాజీ అధ్యక్షుడు కొక్కు నాగేశ్వరరావు కమిటీలో ఉపాధ్యక్షుడిగా ఉన్నారు. నిన్నటి వరకు గుండా శ్రీకాంత్, మనోహర్ తివారి, పులిగళ్ల మాధవరావు, ఈసం నర్సింహ్మారావులలో ఎవరో ఒకరిని అధ్యక్షుడిగా నియమిస్తారనే ప్రచారం జరగడం, చివరకు శ్రీనివాసరెడ్డిని నియమించడం బీఆర్‌ఎస్ శ్రేణుల్లో చర్చనీయాంశమైంది.

ఇంటూరి మోటార్స్ ట్రాక్టర్ షోరూం ప్రారంభం


షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్ రెడ్డి, పక్కన డీసీసీబీ చైర్మన్ నాగభూషణం, షోరూం ప్రతినిధులు

ఖమ్మంరూరల్: మండలంలోని వరంగల్ క్రాస్ రోడ్డులో ఇంటూరి మోటార్స్ ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన ట్రాక్టర్ షోరూంను పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ ప్రాంత రైతులకు ట్రాక్టర్లను అందుబాటులోకి తీసుకొచ్చేందుకు షోరూం ఏర్పాటు అభినందనీయమని తెలిపారు. రైతులకు మెరుగైన సేవలందించాలని సూచించారు. షోరూం మేనేజర్ కె.జయరాజు మాట్లాడుతూ ప్రపంచ ప్రఖ్యాతి గాంచిన సోలిస్ యాన్మర్ ట్రాక్టర్లు ప్రస్తుత వ్యవసాయావసరాలకు ఎంతగానో ఉపయోగపడతాయని తెలిపారు. షోరూంలో ఎక్స్ఛేంజ్, ఫైనాన్స్ సౌకర్యం కూడా ఉందని వెల్లడించారు. కార్యక్రమంలో డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, ఎంపీపీ బెల్లం ఉమ, జెడ్పీటీసీ సభ్యులు ఎ.వరప్రసాద్, ఇంటూరి బేబీ, షోరూం యజమాని ఇంటూరి శేఖర్, కంపెనీ ప్రతినిధులు రాజేశ్‌మోహన్, అరుణ్‌కుమార్, సురేందర్‌పాల్, సర్దార్ తదితరులు పాల్గొన్నారు.

కేంద్రం బెదిరింపులు సరికావు..


వెంకటస్వామి చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న టీఎస్ యూటీఎఫ్ బాధ్యులు

ఖమ్మంసహకారనగర్: పాత పెన్షన్ విధానం సాధన కోసం నిరసన ప్రదర్శనల్లో ఉద్యోగులు పాల్గొంటే క్రమశిక్షణ చర్యలు తీసుకుంటామని కేంద్ర ప్రభుత్వం పేర్కొనడం సరికాదని టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జీవీ నాగమల్లేశ్వరరావు, పారుపల్లి నాగేశ్వరరావు పేర్కొన్నారు. సంఘం వ్యవస్థాపక ప్రధాన కార్యదర్శి అప్పారి వెంకటస్వామి వర్థంతి సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఆయన చిత్రపటం వద్ద నివాళులర్పించాక వారు మాట్లాడారు. పాత పెన్షన్ విధానాన్ని (ఓపీఎస్) పునరుద్ధరించాలంటూ జరుగుతున్న నిరసనల్లో ఉద్యోగులు పాల్గొనవద్దని కేంద్ర ప్రభుత్వం చెప్పడం గర్హనీయమని, ఉద్యోగుల సామాజిక భద్రతకు ముప్పుగా ఉన్న సీపీఎస్‌ను రద్దు చేసి ఓపీఎస్‌ను పునరుద్ధరించాల్సిందేనని స్పష్టం చేశారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి ఉద్దండు షరీఫ్, నాయకులు లక్ష్మీనారాయణ, పుల్లయ్య, శంకరరావు, మౌలాలి తదితరులు పాల్గొన్నారు.

కలప పట్టివేత


నారవేప దుంగలను తరలిస్తున్న అటవీశాఖ సిబ్బంది

టేకులపల్లి: రెండున్నర లక్షల రూపాయల విలువైన నారవేప దుంగలను ఫారెస్టు అధికారులు బుధవారం పట్టుకున్నారు. ఎఫ్‌ఆర్‌ఓ కథనం ప్రకారం.. మండలంలోని కోయగూడెం పంచాయతీ హనుమాతండా సమీపంలో నారవేప దుంగలు అక్రమంగా నిల్వ ఉంచారనే పక్కా సమాచారంతో ఎఫ్‌ఆర్‌ఓ ముఖ్తార్ హుస్సేన్, ఎఫ్‌ఎస్‌ఓలు దేవాసింగ్, శ్రీనివాస్, ఎఫ్‌బీఓలు నాగేష్, రామ్మూర్తి దాడులు చేశారు. కిషన్ అనే రైతు జామాయిల్ తోటలో ఉన్న రూ.2.5 లక్షల విలువైన 15 నారవేప దుంగలను స్వాధీనం చేసుకున్నారు. దుంగలను ఇల్లెందు డిపోకు తరలించి, కేసు నమోదు చేసినట్లు ఎఫ్ఆర్‌ఓ తెలిపారు. నిందితుడి వివరాలు తెలియరాలేదని, విచారణ చేపడుతున్నట్లు పేర్కొన్నారు.

73 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం


రేషన్ బియ్యాన్ని స్వాధీనం చేసుకుంటున్న పోలీసులు

టేకులపల్లి: టాస్క్‌ఫోర్స్, బోడు పోలీసులు మంగళవారం రాత్రి దాడులు నిర్వహించి 73 క్వింటాళ్ల రేషన్ బియ్యం స్వాధీనం చేసుకున్నారు. బోడు ఎస్‌హెచ్‌ఓ వి.బీల్యానాయక్ కథనం ప్రకారం.. మండలంలోని గంగారం పంచాయతీ వజ్జోనిగూడెం గ్రామానికి చెందిన వజ్జా కుసుమారావు పాతలచ్చగూడెం(రోడ్డుగుంపు)తో పాటు చుట్టు పక్కల గ్రామాల్లో రేషన్ బియ్యం కొని, కొత్తగూడెంలో విక్రయిస్తున్నాడు. ఈ క్రమంలో పాతలచ్చగూడేనికి చెందిన గలగ వెంకటేశ్వర్లు ఇంట్లో 33 క్వింటాళ్ల రేషన్ బియ్యం నిల్వ చేయగా పోలీసులు మంగళవారం రాత్రి దాడులు చేసి, సీజ్ చేశారు. కుసుమారావుపై కేసు నమోదు చేశారు. ఏన్కూరు మండలానికి చెందిన జూపాటి రాకేష్ లచ్చగూడెంలో రేషన్ బియ్యం కొనుగోలు చేసి, అదే గ్రామానికి చెందిన ఓ ఇల్లు అద్దెకు తీసుకుని 40 క్వింటాళ్లు నిల్వ చేశాడు. సమాచారం అందడంతో పోలీసులు దాడి చేసి బియ్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. రాకేష్‌పై కేసు నమోదు చేశారు. రెండు ఘటనల్లో స్వాధీనం చేసుకున్న 73 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పౌరసరఫరాల శాఖ అధికారులకు అప్పగించినట్లు ఎస్‌హెచ్‌ఓ తెలిపారు. ఈ దాడుల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్‌ఐ సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాజ్యాంగంపై దాడి జరుగుతోంది..

- కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్యేలను బెదిరిస్తుండడం గర్హనీయం
- జనచైతన్య యాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వీరభద్రం



మధిరలో మాట్లాడుతున్న వీరభద్రం, పక్కన జెడ్పీ చైర్మన్ కమల్‌రాజ్ తదితరులు

వైరా/మధిర/బోనకల్: దేశంలో బీజేపీ అరాచకాలను అరికట్టేందుకు కలిసొచ్చే పార్టీలతో ప్రయాణం చేస్తామని, రాజ్యాంగంపై ఆ పార్టీ చేస్తున్న దాడులను అడ్డుకుంటామని సీపీఎం పార్టీ రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం స్పష్టం చేశారు. పార్టీ ఆధ్వర్యాన చేపట్టిన జన చైతన్య యాత్ర ఆరో రోజైన బుధవారం జిల్లాలోని వైరా, మధిర, బోనకల్ మండలం రావినూతల గ్రామాల్లో కొనసాగింది. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన సభల్లో తమ్మినేని మాట్లాడుతూ దేశంలో కుల, మత విద్వేషాలు రెచ్చగొడుతూ ఒకే దేశం, ఒకే భాష, ఒకే ఎన్నిక అంటూ ప్రశ్నించే వారిపై బీజేపీ ప్రభుత్వం దాడులకు పాల్పడుతుందని విమర్శించారు. రాజ్యాంగాలను మార్చాలని చూస్తున్న ఆ పార్టీ నేతలు.. తొలుత హిందువుల్లో 52 శాతం బీసీ కులాల లెక్క తేల్చి రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేశారు. కాగా, రాష్ట్రంలో సీఎం కేసీఆర్ కుమార్తె, ఎమ్మెల్యేలను కేసుల పేరుతో కేంద్రం బెదిరిస్తోందని వీరభద్రం తెలిపారు. ఈక్రమంలో బీజేపీకి వ్యతిరేకంగా పోరాటం చేస్తున్న సీఎం కేసీఆర్‌కు అభినందనలు తెలియజేస్తున్నామన్నారు. ఇదే సమయాన సీఎం కేసీఆర్ ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహిస్తే కమ్యూనిస్టు పార్టీలు పోరాటాలు చేస్తాయని తమ్మినేని స్పష్టం చేశారు. పేదల ఇళ్ల నిర్మాణానికి పెద్ద సార్ రూ.11 లక్షలు, చిన్న సార్ రూ.5లక్షలు ప్రకటించాలని ప్రధాని, సీఎంను ఉద్దేశించి ఆయన డిమాండ్ చేశారు. ఇక ఉమ్మడి జిల్లాలో ఓ నేత జంక్షన్‌లో ఉన్నప్పటికీ బీజేపీ పార్టీలో చేరి జిల్లా ప్రజలకు నష్టం చేయొద్దని హితవు పలికారు. కాగా, నల్లధనాన్ని వెనక్కి తెస్తామని, ఒక్కొక్కరికి అకౌంట్‌లో రూ.15 వేలు వేస్తామని, అందరికీ ఉద్యోగ అవకాశాలు కల్పిస్తామని మోదీ ఇచ్చిన హామీల్లో ఏ ఒక్కటీ నెరవేర్చలేదని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో మోదీ ప్రభుత్వానికి గుణపాఠం చెప్పేందుకు సీపీఎం, సీపీఐ పార్టీలు సీఎం కేసీఆర్ వెంటే నడుస్తాయనని.. వచ్చే ఎన్నికల్లో కలిసి పోటీ చేస్తామని తెలిపారు. ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తున్న బీజేపీ రాష్ట్రంలో అధికారంలోకి వస్తే పెను ప్రమాదమని.. అందుకే బీఆర్‌ఎస్‌తో కలిసి బీజేపీని గెలుపును అడ్డుకుంటామని చెప్పారు. ఒకే దేశం, ఒకే మతం అంటున్న మోదీ, షాలు ఒకే కులం అని ఎందుకు అనడం లేదని ప్రశ్నించారు. బీజేపీకి తాబేదారుగా ఈడీ పనిచేస్తుందని వీరభద్రం విమర్శించారు.


వైరాలో తమ్మినేని వీరభద్రంను సన్మానిస్తున్న ఎమ్మెల్యే రాములునాయక్

పలువురి సంఘీభావం

సీపీఎం ఆధ్వర్యాన చేపట్టిన జన చైతన్య యాత్రకు బీఆర్‌ఎస్, సీపీఐ నాయకులు సంఘీభావం తెలిపారు. ఈమేరకు వైరాలో వీరభద్రంను కలిసిన ఎమ్మెల్యే రాములునాయక్ మాట్లాడుతూ తమ కుటుంబం కూడా కమ్యూనిస్టు కుటుంబమేనని.. అందరం కలిసి దుష్ట బీజేపీపై పోరాడి హిందూ మహాసముద్రంలో కలపాలని పిలుపునిచ్చారు. సీఎం కేసీఆర్, తెలంగాణపై మోదీ కక్షకట్టినా.. ఆయనకు ఎవరూ లొంగరని తెలిపారు. ఇక మధిరలో యాత్రకు జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్ సంఘీభావం తెలిపి మాట్లాడారు. ఈయాత్రలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు పోతినేని సుదర్శన్‌రావు, సీఐటీయూ రాష్ట్ర నాయకుడు మందడపు సాయిబాబా, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, రైతు సంఘం జిల్లా కార్యదర్శి బొంతు రాంబాబు, ఎస్‌ఎఫ్‌ఐ రాష్ట్ర కార్యదర్శి నాగరాజు, మధిర మున్సిపల్ చైర్‌పర్సన్, వైస్ చైర్‌పర్సన్లు మొండితోక లత, శీలం విద్యాలతతో పాటు సీపీఎం, బీఆర్‌ఎస్ నాయకులు, ప్రజాప్రతినిధులు భూక్యా వీరభద్రం, సుంకర సుధాకర్, తోట నాగేశ్వరరావు, మల్లు లక్ష్మి, బొంతు సమత, చెరుకుమల్లి కుటుంబరావు, యర్రా బాబు, యమాల గోపాలరావు, ముళ్లపాటి సీతారాములు, మల్లు లక్ష్మి, కల్యాణపు వెంకటేశ్వరరావు, మందడపు రాణి, బెజవాడ రవిబాబు, శీలం నర్సింహారావు, చిత్తారి నాగేశ్వరరావు, రావూరి శ్రీనివాసరావు, మందా సైదులు, పొన్నం వెంకటేశ్వరావు, చింతలచెర్వు కోటేశ్వరావు, బండి రమేష్, దొండపాటి నాగేశ్వరావు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా...

నేడు ఎమ్మెల్యేల కోటా ఎమ్మెల్సీ ఎన్నికల పోలింగ్

సాక్షి, అమరావతి: ఎమ్మెల్యేల కోటాలో ఖాళీ అయిన ఏడు ఎమ్మెల్సీ స్థానాలకు గురువారం పోలింగ్ జరగనుంది. వెలగపూడిలోని తాత్కాలిక శాసనసభ ప్రాంగణంలో పోలింగ్‌కు ఎన్నికల సంఘం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. శాసనసభలో మొత్తం సభ్యుల సంఖ్య 175. ఇందులో వైఎస్సార్‌సీపీకి 151 మంది సభ్యులు ఉండగా.. టీడీపీకి అధికారికంగా 23 మంది, జనసేనకు ఒకరు ఉన్నారు. నలుగురు సభ్యులు టీడీపీకి దూరంగా ఉంటున్నారు. దీంతో టీడీపీకి 19 మంది బలం మాత్రమే ఉంది. అలాగే జనసేనకు ఉన్న ఒక సభ్యుడు కూడా ఆ పార్టీకి దూరమయ్యారు. ఒక్కో ఎమ్మెల్సీ గెలుపొందడానికి 22 మంది సభ్యుల ఓట్లు అవసరం. వైఎస్సార్‌సీపీకి స్పష్టమైన ఆధిక్యత ఉన్న నేపథ్యంలో ఏడు స్థానాలకు అభ్యర్థులను బరిలోకి దించింది. ఈ క్రమంలో వాస్తవంగా చూస్తే.. ఒక్క స్థానం గెలవడానికి కూడా టీడీపీకి బలం లేదు. అయినా సరే అభ్యర్థిని బరిలోకి దింపడం చర్చనీయాంశంగా మారింది. కాగా, సాయంత్రం ఐదు గంటల నుంచి కౌంటింగ్ ప్రారంభం కానుంది.

ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు శ్రీనాథ్‌రెడ్డి కన్నుమూత



సాక్షి, అమరావతి: ఏపీ ప్రెస్ అకాడమీ మాజీ అధ్యక్షుడు, సీనియర్ జర్నలిస్టు దేవిరెడ్డి శ్రీనాథ్‌రెడ్డి (67) కన్నుమూశారు. హైదరాబాద్‌లో ఉంటున్న ఆయన కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడుతూ చికిత్స పొందుతున్నారు. హైదరాబాద్ అప్పా జంక్షన్ కాళిమాత టెంపుల్ సమీపంలో నివసిస్తున్న ఆయన బుధవారం రాత్రి 7.45 గంటలకు తన స్వగృహంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు భార్య సుధారాణి, కుమార్తెలు దీప్తి, కీర్తి ఉన్నారు. శ్రీనాథ్‌రెడ్డి అంత్యక్రియలు శుక్రవారం సాయంత్రం ఆయన స్వగ్రామం వైఎస్సార్ జిల్లా సింహాద్రిపురం మండలం కోరగుంటపల్లిలో నిర్వహించనున్నట్లు బంధువులు తెలిపారు. పులివెందుల నియోజకవర్గం కోరగుంటపల్లిలో రాజకీయ నేపథ్యం ఉన్న కుటుంబంలో జన్మించిన ఆయన.. 1978లో ఇండియన్ ఎక్స్‌ప్రెస్‌లో చేరారు. కడప రిపోర్టర్‌గా దాదాపు 30 ఏళ్లు, తరువాత కొంతకాలం హైదరాబాద్‌లో పనిచేశారు. ఇండియన్ ఎక్స్‌ప్రెస్ గ్రూపు సంస్థలు, బీబీసీ, సాక్షిలో ఉన్నత హోదాల్లో పనిచేశారు. ఏపీయూడబ్ల్యూజేలో కీలకనేతగా వ్యవహరించారు. 2019 నుంచి దాదాపు మూడేళ్లు శ్రీనాథ్‌రెడ్డి ప్రెస్ అకాడమీ చైర్మన్‌గా పనిచేశారు. ఆయన మృతికి సీఎం జగన్‌మోహన్‌రెడ్డి సంతాపం వ్యక్తం చేశారు.



పంచాంగ శ్రవణం ఆలకిస్తున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్, ఆయన సతీమణి వైఎస్ భారతి



ఉగాది పచ్చడి స్వీకరిస్తున్న సీఎం వైఎస్ జగన్ దంపతులు

ఏడాదంతా.. వసంత 'శోభ'

సీఎం జగన్ నివాసంలోని గోశాలలో ఉగాది వేడుకలు

- తెలుగుదనం ఉట్టిపడేలా కొత్త సంవత్సరం సంబరాలు
- సతీసమేతంగా పాల్గొని పూజలు నిర్వహించిన సీఎం జగన్
- పరిపాలన బాగుంటుంది.. సమన్యాయంతో ముందుకువెళ్తారన్న పంచాంగ శ్రవణకర్త సుబ్బరాయ సోమయాజులు

సాక్షి, అమరావతి: శోభకృత్ నామ సంవత్సరంలో తెలుగువారందరికీ మంచి జరగాలని, తెలుగు లోగిళ్లు సిరిసంపదలు, ఆయురారోగ్యాలతో కళకళలాడాలని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆకాంక్షించారు. బుధవారం తాడేపల్లిలోని సీఎం క్యాంపు కార్యాలయం గోశాలలో ఉగాది వేడుకలు ఘనంగా జరిగాయి. తెలుగు సంప్రదాయం, ఆచారాలు ఉట్టిపడేలా సంబరాలను నిర్వహించారు. తిరుమలలోని ఆనంద నిలయం తరహాలో శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయ నమూనాతో ప్రాంగణాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. మండపంలోని గోడలకు ఏర్పాటు చేసిన దశావతారాల బొమ్మలు ఆకట్టుకున్నాయి.

సీఎం దంపతుల పూజలు

సంప్రదాయ పంచెకట్టులో సతీ సమేతంగా ఉగాది వేడుకలకు ముఖ్యమంత్రి జగన్ దంపతులు హాజరయ్యారు. ఈ సందర్భంగా సతీమణి వైఎస్ భారతికి నుదుటున కుంకుమ బొట్టును సీఎం జగన్ దిద్దగా ఆమె కూడా బొట్టు పెట్టారు. అనంతరం ఉగాది వేడుకల ప్రాంగణంలోని శ్రీవేంకటేశ్వరుని సన్నిధిలో సీఎం దంపతులు పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలను స్వీకరించారు. టీటీడీ, శ్రీ దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానం వేదపండితులు సీఎం దంపతులకు వేదాశీర్వచనం, తీర్థ ప్రసాదాలను అందించారు. దివంగత వైఎస్ రాజశేఖరరెడ్డి విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం ముఖ్యమంత్రి జగన్ పంచాంగ శ్రవణం కార్యక్రమంలో పాల్గొన్నారు. పంచాంగకర్త కప్పగంటి సుబ్బరాయ సోమయాజులు రూపొందించిన పంచాంగాన్ని ముఖ్యమంత్రి ఆవిష్కరించారు. పంచాంగ శ్రవణం అనంతరం సీఎం జగన్ దంపతులు ఉగాది పచ్చడిని స్వీకరించారు. రాష్ట్రంలో ప్రతి అక్కకు, చెల్లెమ్మకు, ప్రతి సోదరుడికి, స్నేహితుడికి, అవ్వాతాతలకూ నూతన సంవత్సరంలో అంతా మంచి జరగాలని, దేవుడి ఆశీస్సులు మెండుగా ఉండాలని మనసారా ఆకాంక్షిస్తూ సీఎం జగన్ అందరికీ ఉగాది శుభాకాంక్షలు తెలిపారు.

పరిపాలన బాగుంటుంది

ఏపీలో పరిపాలన బాగుంటుందని పంచాంగ శ్రవణంలో సుబ్బరాయ సోమయాజులు చెప్పారు. 'ఈ ఏడాది శ్రామికులు, కర్షకులకు లాభదాయకంగా ఉంటుంది. పశు సంపద, పాడి పరిశ్రమ బాగుంటుంది. ప్రభుత్వ విధానాలు రైతులకు అనుకూలంగా ఉంటాయి. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలతో పాటు ప్రజల మధ్య స్నేహం విలసిల్లి ముందుకు నడుస్తారు. విజయవంతమైన పథకాలను చేపట్టి ముందుకు వెళ్తారు. ప్రజలకు అవసరమైన ప్రణాళికలను అమలు చేస్తారు. సమన్యాయంతో ముందుకువెళ్తారు. ఈ ఏడాదంతా రాష్ట్ర ప్రజలకు మంచి ఫలితాలు లభించడానికి అవకాశాలు మెండుగా కనిపిస్తున్నాయి' అని పేర్కొన్నారు.




ఆలయం వెలుపల పూల అలంకరణ

శ్రీవారి చెంత వేడుకగా ఉగాది ఆస్థానం

శోభాయమానంగా ఫల, పుష్పాలంకరణ

తిరుమల: తిరుమల శ్రీవారి ఆలయంలో బుధవారం శ్రీ శోభకృత్ నామ సంవత్సర ఉగాది ఆస్థానం వేడుకగా జరిగింది. ఉదయం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ మలయప్పస్వామి వారికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ చేశారు. విమాన ప్రాకారం, ధ్వజస్తంభం చుట్టూ ఊరేగింపుగా ఆలయంలోనికి ప్రవేశించారు. శ్రీవారి ఉత్సవమూర్తులు బంగారు వాకిలిలో గరుడాళ్వారుకు అభిముఖంగా సర్వభూపాల వాహనంపై వేంచేపు చేశారు. మరో పీఠంపై స్వామివారి సర్వసైన్యాధ్యక్షుడు శ్రీ విష్వక్సేనుల వారిని వేంచేపు చేశారు. ఆ తరువాత శ్రీవారి మూలవిరాట్టుకు, ఉత్సవమూర్తులకు నూతన వస్త్రాలను ధరింపచేసి పంచాంగ శ్రవణం నిర్వహించారు. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు. ఉగాదిని పురస్కరించుకుని టీటీడీ ఉద్యానవన విభాగం ఆధ్వర్యంలో ఆలయం లోపల విభిన్న రకాల పండ్ల గుత్తులు, అపురూపమైన ఉత్తమజాతి పుష్పాలతో శ్రీవారి ఆలయాన్ని ఆకర్షణీయంగా అలంకరించారు. కాగా, టైం స్లాట్ టికెట్లు కలిగిన వారికి సకాలంలో, దర్శన టికెట్లు లేని వారికి 12 గంటల్లో , ప్రత్యేక ప్రవేశ దర్శనం టికెట్లు ఉన్నవారికి 3 గంటల్లో శ్రీవారి దర్శనమవుతోంది.

రూ.4,411.68 కోట్లతో టీటీడీ బడ్జెట్



- 2023–24 బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం

తిరుమల: వచ్చే ఆర్థిక సంవత్సరానికి (2023– 24కి) తిరుమల తిరుపతి దేవస్థానాల (టీటీడీ) బడ్జెట్‌కు ధర్మకర్తల మండలి ఆమోదం తెలిపింది. రూ.4,411.68 కోట్ల బడ్జెట్‌ను ఫిబ్రవరి 15న జరిగిన పాలకమండలి సమావేశం ఆమోదించినట్లు టీటీడీ చైర్మన్ వై.వి.సుబ్బారెడ్డి చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉన్నందున అప్పుడు ఈ వివరాలు వెల్లడించలేదని తెలిపారు. తిరుమలలో బుధవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ బడ్జెట్ ప్రతిపాదనలకు రాష్ట్ర ప్రభుత్వం ఆమోదముద్ర వేసిందని చెప్పారు. గత నెలలో జరిగిన పాలకమండలి సమావేశంలో కొన్ని పాలనపరమైన నిర్ణయాలు కూడా తీసుకున్నట్లు తెలిపారు. సుబ్బారెడ్డి వెల్లడించిన వివరాలు..

* వీఐపీ బ్రేక్ దర్శన సమయం మార్చినందువల్ల సామాన్య భక్తులకు ఎంతో ఉపయోగకరంగా ఉంది. ఈ విధానాన్ని కొనసాగిస్తాం.
* కోవిడ్‌కు ముందు ఏడాదికి రూ.1,200 కోట్ల కానుకలు లభించేవి. కోవిడ్ తరువాత హుండీ ఆదాయం ఏడాదికి రూ.1,500 కోట్ల వరకు పెరిగింది.
* కోవిడ్ సమయంలో వర్చువల్ సేవా టికెట్లు ఆన్‌లైన్‌లో జారీచేశాం. ఈ సేవలు కొనసాగించాలని నిర్ణయించాం.
* వేసవిలో మూడునెలలు భక్తుల రద్దీ బాగా పెరిగే అవకాశం ఉన్నందువల్ల వీఐపీల సిఫారసులు బాగా తగ్గించాలని కోరుతున్నాం. శ్రీవాణి టికెట్ల సంఖ్య కూడా తగ్గించి ఎక్కువమంది సామాన్య భక్తులకు దర్శనం కల్పిస్తాం.

హుండీ ద్వారా రూ.1,591 కోట్ల రాబడి అంచనా

వచ్చే ఆర్థిక సంవత్సరంలో శ్రీవారి హుండీ ద్వారా సుమారు రూ.1,591 కోట్ల ఆదాయం వస్తుందని బడ్జెట్‌లో టీటీడీ అంచనా వేసింది. 2022–23 బడ్జెట్‌తో పోలిస్తే ఈ బడ్జెట్ రూ.1,315.28 కోట్ల మేర పెరిగింది. టీటీడీ వివిధ బ్యాంకుల్లో డిపాజిట్ చేసిన నగదు, బంగారం ద్వారా పెద్ద ఎత్తున వడ్డీ ఆదాయం లభిస్తోంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో రూ.813 కోట్ల వడ్డీ వస్తున్నట్లు అంచనా వేసిన టీటీడీ.. రానున్న ఆర్థిక సంవత్సరంలో వడ్డీ ఆదాయం మరో రూ.177 కోట్లు పెరిగి మొత్తం రూ.990 కోట్లు వస్తాయని పేర్కొంది.

రూ.7.48 కోట్ల బంగారం స్వాధీనం...

నలుగురి అరెస్టు
కస్టమ్స్ అధికారుల విస్తృత దాడులు

సాక్షి, అమరావతి/పటమట (విజయవాడ తూర్పు): విజయవాడ కస్టమ్స్ విభాగం అధికారులు బుధవారం రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో దాడులు నిర్వహించి అక్రమంగా తరలిస్తున్న రూ.7.48 కోట్ల విలువైన బంగారాన్ని స్వాధీనం చేసుకుని నలుగురిని అరెస్టు చేశారు. విశ్వసనీయ సమాచారం మేరకు విజయవాడ రైల్వే స్టేషన్‌లో కస్టమ్స్ అధికారులు 5 కేజీల అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఆ నిందితులను విచారించి రాబట్టిన సమాచారం ఆధారంగా ఏపీ–తమిళనాడు సరిహద్దుల్లో 30 మంది అధికారుల బృందం విస్తృతంగా దాడులు చేసి కార్లు, స్కూటర్లలో అక్రమంగా తరలిస్తున్న మరో 7.79 కేజీల బంగారాన్ని పట్టుకున్నారు. మొత్తం మీద 15 ప్రాంతాల్లో మొత్తం రూ.7.48 కోట్ల విలువైన 12.97 కేజీల బంగారాన్ని కస్టమ్స్ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. నలుగురు నిందితులను న్యాయస్థానంలో హాజరుపరిచారు. కాగా, 2022–23లో విజయవాడ కస్టమ్స్ అధికారులు దాడులు నిర్వహించి రూ.19.75 కోట్ల విలువైన అక్రమ బంగారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు కస్టమ్స్ కమిషనర్ కె.ఇంజనీర్ తెలిపారు.

నేడు స్పెషాలిటీ వైద్య పోస్టుల భర్తీకి ఇంటర్వ్యూలు

సాక్షి, అమరావతి: ఏపీ వైద్య విధాన పరిషత్ (ఏపీవీవీపీ) ఆస్పత్రుల్లో 5 స్పెషాలిటీల్లో 180 సివిల్ అసిస్టెంట్ సర్జన్ స్పెషలిస్ట్ (సీఏఎస్‌ఎస్) పోస్టుల భర్తీకి ప్రభుత్వం గురువారం వాక్–ఇన్ ఇంటర్వ్యూ నిర్వహించనుంది. విజయవాడలోని పాత జీజీహెచ్ ప్రాంగణంలో ఉన్న డీఎంఈ కార్యాలయంలో ఇంటర్వ్యూలు జరగనున్నాయి. ఏపీవీవీపీ ఆస్పత్రుల్లో 14 స్పెషాలిటీల్లో 445 పోస్టుల భర్తీకి 23 నుంచి 27వ తేదీ వరకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నారు. పూర్తి వివరాలకు 6301138782 నంబర్‌ను సంప్రదించవచ్చు.

జిల్లా వార్తలు

సాయిబాబాకు రూ.44 లక్షల విలువైన స్వర్ణ రుద్రాక్షమాల



స్వామికి స్వర్ణ రుద్రాక్షమాల అలంకరిస్తున్న ఎస్పీ వినీత్ దంపతులు

భద్రాచలంటౌన్: భద్రాచలం డిగ్రీ కళాశాల సెంటర్‌లోని సాయిబాబా మందిరంలో స్వామికి బుధవారం ఉగాదిని పురస్కరించుకుని స్వర్ణ రుద్రాక్ష మాల అలంకరించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యాన రూ.44 లక్షల వ్యయంతో ఈ మాల తయారుచేయించగా ఎస్పీ డాక్టర్ వినీత్ దంపతులు స్వామి వారికి అలంకరించారు. అనంతరం అభిషేకం, అర్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ అధ్యక్షుడు తుమ్మలపల్లి సత్యనారాయణమూర్తితో పాటు కురిచేటి శ్రీనివాసరావు, కొమ్మనాపల్లి ఆదినారాయణ, కుంచాల రమేష్, సుబ్రహ్మణ్యం, శ్రీనివాసరావు, వెంకటరమణ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

కిన్నెరసానిలో 'ఉగాది' సందడి

పాల్వంచరూరల్: ఉగాది పర్వదినంతోపాటు సెలవు కావడంతో బుధవారం మండలంలోని పర్యాటక ప్రాంతమైన కిన్నెరసానికి పెద్దసంఖ్యలో పర్యాటకులు తరలివచ్చారు. దీంతో కిన్నెరసాని ప్రాజెక్టు పరిసరాలు కోలాహలంగా మారాయి. జలాశయంలో బోటు షికారు చేయడమే కాక డీర్ పార్కును సందర్శించి ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉత్సాహంగా గడిపారు. కాగా, పర్యాటకుల టికెట్ల ద్వారా వైల్డ్‌లైఫ్ శాఖకు రూ.12,690, బోటుషికారు టికెట్ల ద్వారా టూరిజం కార్పొరేషన్‌కు రూ.12,570 ఆదాయం సమకూరింది.

పట్టింపు లేని 'శాట్స్'

- నిధులు, నియామకాల్లేవు..
- ఔత్సాహికులకు సీనియర్ క్రీడాకారులే కోచ్‌లు
- క్రీడా సంఘాలు నిర్వహించే టోర్నీలకు సైతం నిధుల కొరత
- కోచ్‌లు లేక గ్రామాల్లో నిరుపయోగంగా క్రీడాప్రాంగణాలు



కబడ్డీ ఆడుతున్న బాలికలు (ఫైల్)

ఖమ్మంస్పోర్ట్స్: క్రీడలు, క్రీడాకారుల అభివృద్ధిపై తెలంగాణ రాష్ట్ర స్పోర్ట్స్ అథారిటీ (శాట్స్) పెద్దగా దృష్టి సారించడం లేదనే విమర్శలు వస్తున్నాయి. ప్రధానంగా ఔత్సాహిక క్రీడాకారులను ప్రోత్సహించేలా శాట్స్ తగిన రీతిలో చర్యలు తీసుకోకపోవడంతో రాష్ట్ర జట్లు ఆశించిన స్థాయిలో జాతీయస్థాయి పోటీల్లో రాణించడంలేదని తెలుస్తోంది. జిల్లాలోని స్పోర్ట్స్ అథారిటీలకు గతంలో ఏడాదికి కనీసం రూ.50 వేల నిధులు మంజూరు చేసేది. కానీ కొన్నేళ్లుగా ఈ నిధుల ఊసే లేదు. దీంతో అన్ని హంగులు కలిగిన జిల్లాల్లో స్పోర్ట్స్ అథారిటీ స్టేడియాల ద్వారా ఆదాయం సమకూర్చుకుంటుండగా.. సౌకర్యాలు లేని చోట స్పోర్ట్స్ అథారిటీలు మూసివేసే పరిస్థితి వచ్చిందని క్రీడావర్గాలు చెబుతున్నాయి. కొన్ని స్టేడియాల్లో కార్యాలయం ఖర్చులకు కూడా కలెక్టర్ల నుంచి సమకూర్చుకోవాల్సి వస్తోందని చెబుతున్నారు. ప్రస్తుతం క్రీడలకు విపరీతమైన ఆదరణ లభిస్తుండగా.. క్రీడాంశాల్లో సీనియర్ శిక్షకులు లేక ఔత్సాహికులకు ప్రతిబంధకంగా నిలుస్తోంది. దీంతో క్రీడా సంఘాలు, సీనియర్ క్రీడాకారులే కొంత మేర ప్రయత్నాలు చేస్తున్నారు. ఇదిలాగే కొనసాగితే ఔత్సాహిక క్రీడాకారులు నిరాశతో క్రీడలకు దూరమయ్యే అవకాశముందనే వ్యాఖ్యలు వస్తున్నాయి.

అన్నింటికీ ఒకే బడ్జెట్

క్రీడల కోసం ప్రత్యేక క్రీడా శాఖ ఉన్నా లేనట్లుగానే మిగిలిపోతోంది. ఏటా రాష్ట్ర బడ్జెట్ నుంచి క్రీడా శాఖకు రూ.200 కోట్లు కేటాయిస్తున్నా అన్ని రకాల క్రీడా అవసరాలకు ఇందులో నుంచే ఖర్చు చేయాల్సి వస్తోంది. ఫలితంగా సత్తా చాటుతున్న క్రీడాకారులకు ఏం ఒరగడం లేదని పలువురు చెబుతున్నారు. మౌలిక సదుపాయాల కల్పన, క్రీడాకారుల తర్ఫీదుకు వేర్వేరు బడ్జెట్ కేటాయిస్తేనే సంపూర్ణ క్రీడాభివృద్ధి జరుగుతుందనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఇతర శాఖల మాదిరిగా క్రీడ శాఖను ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుంటేనే ఫలితాలు వస్తాయని అంటున్నారు.

2009 తర్వాత కోచ్‌ల నియామకాల్లేవు..

తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీలో శిక్షకుల నియామకం ఊసే లేకపోవడం తీవ్ర విమర్శలకు తావిస్తోంది. రాష్ట్ర, జాతీయస్థాయి పోటీల్లో రాణించి నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ స్పోర్ట్స్ (ఎన్‌ఐఎస్) శిక్షణ పూర్తి చేసిన వారు వందలాది మంది సీనియర్ క్రీడాకారులు ఉన్నా వారి నియామకంపై శాట్స్ దృష్టి సారించడంలేదు. 1993కు ముందే శిక్షకులను నియమించగా.. 1993లో దాదాపు 60 మందికి పైగా కోచ్‌లను కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్నారు. ఆ తర్వాత 1999లో ఐదుగురిని, 2009లో మళ్లీ 15 మందిని కాంట్రాక్టు పద్ధతిలో తీసుకున్నారు. ఇక అప్పటి నుంచి ఏ క్రీడాంశంలో కూడా కనీసం కాంట్రాక్టు పద్ధతిలోనైనా కోచ్‌లను నియమించకపోవడంతో శిక్షణ పొందిన వారు నిరాశ చెందుతున్నారు. 1998లో కార్పొరేట్ క్రీడలకు విపరీతమైన ఆదరణ ఉండటంతో నాటి స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 'ప్లే అండ్ పే' పథకాన్ని ప్రవేశపెట్టింది. అయినా కార్పొరేట్ క్రీడలకే ఈ పథకం పరిమితమైంది. ఏడేళ్ల నుంచి ప్లే అండ్ పే పథకం అన్ని క్రీడాంశాలకు తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ వర్తింపజేస్తుండడంతో జిల్లా కేంద్రాల్లోని సీనియర్ క్రీడాకారులు లేదా ఆరు వారాల ఎన్‌ఐఎస్, ఏడాది శిక్షణ పూర్తి చేసిన వారిని నియమించి శిక్షణ ఇప్పిస్తున్నారు. తద్వారా వారికి ఉపాధి లభించడమే కాక స్టేడియాలకు కొంత మేర ఆదాయం లభిస్తోంది. ఇదిలా ఉండగా ప్రస్తుతం శాట్స్‌లో పర్మనెంట్ ఉద్యోగులు ముగ్గురు మాత్రమే ఉండగా మరో ముగ్గురు కోచ్‌లు ఉన్నారు. మిగిలిన వారిలో కాంట్రాక్ట్ కోచ్‌లు కేవలం 35 మంది మాత్రమే ఉండగా.. 2016లో తెలంగాణ స్పోర్ట్స్ అథారిటీ, రాష్ట్ర యువజన సర్వీసుల శాఖలను విలీనం చేసింది. అప్పటి నుంచి పాత పది జిల్లాలకు శాట్స్ శిక్షకులే డీవైఎస్‌ఓలుగా కొనసాగాలని సూచించడంతో ఈ పోస్టు వద్దని కోచ్‌లుగానే కొనసాగుతున్నారు. ఇక 1993 నుంచి కాంట్రాక్టు పద్ధతిపై నియమితులైన కోచ్‌లను ఇప్పటికీ పర్మనెంట్ చేయకపోవడంతో వారు నిరుత్సాహానికి గురవుతున్నారు. ఇందులో కొందరు ఉద్యోగ విరమణ కూడా చేయగా.. శాట్స్ కనీస గుర్తింపు లేని కారణంగా దుర్భర జీవనం సాగిస్తున్నారు. రాష్ట్రప్రభుత్వం ఇప్పటికైనా కాంట్రాక్టు కోచ్‌లను పర్మనెంట్ చేయడమే కాక అన్ని జిల్లాల్లో సరిపడా కోచ్‌లను నియమించాలని కోరుతున్నారు.

క్రీడా ప్రాంగణాలు అవసరమా?

అన్ని గ్రామ పంచాయతీల్లో ఒకేసారి వేలాది క్రీడా ప్రాంగణాలు నిర్మించారు. వీటి కోసం ప్రత్యేకంగా రూ.56 వేల చొప్పున కేటాయించారు. కానీ సరైన సౌకర్యాలు, కోచ్‌లు లేక ఈ క్రీడాప్రాంగణాలు ఇప్పుడు నిరుపయోగంగా మారాయి. వీటికి రూ.కోట్లు వెచ్చించే బదులు కోచ్‌లను నియమిస్తే ఔత్సాహిక క్రీడాకారులకు ఉపయోగం జరిగేది. ఇకనైనా ఏ క్రీడకు ఆదరణ ఉందో ఆ గ్రామంలోని క్రీడా ప్రాంగణంలో కోచ్‌ను నియమిస్తే ఫలితం ఉంటుందని చెబుతున్నారు.

ఉగాది పురస్కారాలు స్వీకరించిన విద్వాంసులు



మంత్రి ఐకే.రెడ్డి చేతుల మీదుగా పురస్కారం అందుకుంటున్న నాగేశ్వరరావు



కేశవ్




మధుసూదనాచార్యులు

భద్రాచలం: భద్రాచలం శ్రీ సీతారామ చంద్రస్వామి దేవస్థానంలో వాయిద్య విద్వాంసులుగా పనిచేస్తున్న ఎం. నాగేశ్వరరావు, ఎల్.కేశవ్ రాష్ట్ర ప్రభుత్వ ఉగాది పురస్కారాలను స్వీకరించారు. హైదరాబాద్‌లోని రవీంద్ర భారతిలో బుధవారం జరిగిన ఉగాది వేడుకల్లో రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఇంద్రకరణ్ రెడ్డి వీరికి పురస్కారాలు అందజేసి సన్మానించారు. ఈకార్యక్రమంలో రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి మల్లారెడ్డి, తెలంగాణ బ్రాహ్మణ పరిషత్ చైర్మన్ కే.వీ.రమణాచారి తదితరులు పాల్గొన్నారు. కాగా, దేవస్థానంలో నాగేశ్వరరావు డోలు, కేశవ్ సన్నాయి వాయిద్య విద్వాంసులుగా పని చేస్తున్నారు.

అర్చకుడు మధుసూదనాచార్యులు..

నేలకొండపల్లి: నేలకొండపల్లిలోని శ్రీ వెంకటేశ్వర స్వామి దేవాలయ అర్చకుడు తుపురాణి మధుసూదనాచార్యులు రాష్ట్రప్రభుత్వం ఉగాది పురస్కారాన్ని హైదరాబాద్ రవీంద్రభారతిలో స్వీకరించారు. ఆయనను సర్పంచ్ రాయపూడి నవీన్‌తో పాటు బొందయ్య, వెంకటలక్ష్మి, దోసపాటి శేఖర్, రేగూరి హనుమంతరావు, దోసపాటి శేఖర్ తదితరులు అభినందించారు.

'స్ఫూర్తి' ఆధ్వర్యాన ఉగాది అవార్డులు



అవార్డులు అందుకున్న వారితో నిర్వాహకులు, అతిథులు

ఖమ్మంగాంధీచౌక్: సామాజిక, సాంస్కృతిక, సాహిత్య రంగాల్లో సేవలందిస్తున్న ఉమ్మడి జిల్లాలోని పలువురికి స్ఫూర్తి కల్చరల్ అకాడమీ ఆధ్వర్యాన బుధవారం ఉగాది అవార్డులు ప్రదానం చేశారు. ఖమ్మం టీఎన్జీవోస్ ఫంక్షన్ హాల్‌లో మంగళవారం రాత్రి జరిగిన సమావేశంలో జెడ్పీ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, ఖమ్మం కళాపరిషత్ అధ్యక్ష, కార్యదర్శులు నాగబత్తిని రవి, వేల్పుల విజేత తదితరులు పాల్గొని ఈ అవార్డులు అందజేశారు. అవార్డులు అందుకున్న వారిలో పద్మశ్రీ అవార్డు గ్రహీత వనజీవి రామయ్య దంపతులు, సకిని రామచంద్రయ్యతో పాటు వివిధ రంగాల్లో ప్రముఖులైన సింధు తపస్వి, గాజుల భారతి శ్రీనివాస్, ఏలూరి మీన, వీ.ఎస్.మల్లీశ్వరి, ఎండీ.షఫీ ఉన్నారు. ఈ సందర్భంగా జ్యోతినివాస్‌లోని అంధ విద్యార్థులకు నాగబత్తిని రవి, మామిడి వినయ్ తదితరులు ఆర్థిక సాయం అందజేశారు. అనంతరం శ్వేతవర్దిని, సాహితి, మామిడి యశ్విత చేసిన నృత్యాలు ఆకట్టుకున్నాయి.

పెద్దాస్పత్రిలో లక్ష్య, ముస్కాన్ బృందాలు



ఆస్పత్రిలో రికార్డులను పరిశీలిస్తున్న బృందం సభ్యులు

ఖమ్మం వైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రిని బుధవారం లక్ష్య, ముస్కాన్ జాతీయ బృందాలు పరిశీలించాయి. ఈసందర్భంగా మాతా శిశు సంరక్షణ కేంద్రంలో అందుతున్న సేవలను డాక్టర్ రతి మాలచంద్రన్, డాక్టర్ సంధ్య పాప్‌నేజ ఆధ్వర్యంలోని బృందం పరిశీలించి వివరాలు ఆరాతీసింది. పీడియాట్రిక్ ఆపరేషన్ థియేటర్, గైనిక్ థియేటర్, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, లేబర్ రూం, ఎంసీహెచ్ ఓటీ, డీఈఐసీ విభాగం, మిల్క్ బ్యాంక్‌లను పరిశీలించారు. కాగా, ఈ బృందాల పరిశీలన గురువారం కూడా కొనసాగుతుంది. ఈ బృందాలు ఇచ్చే నివేదిక ఆధారంగా లక్ష్య అవార్డు వరిస్తే ఆస్పత్రికి ఏటా రూ.6లక్షల చొప్పున మూడేళ్లు, ముస్కాన్ అవార్డు వస్తే రూ.12 లక్షల చొప్పున మూడేళ్ల పాటు నిధులు అందుతాయి. ఆస్పత్రి సూపరింటెండెంట్ బి.వెంకటేశ్వర్లు, ఆర్ఎంఓ బి.శ్రీనివాసరావు, డాక్టర్లు కృపా ఉషశ్రీ, మంగళ, ప్రసన్న జ్యోతి, పవన్, నర్సింగ్ సూపరింటెండెంట్ సుగుణ, క్వాలిటీ మేనేజర్ ఉపేందర్, సఫియా, లావణ్య, వినయ్ పాల్గొన్నారు.

ఎస్‌ఐ, దళిత నేత మధ్య వాదోపవాదాలు

ఇద్దరినీ సముదాయించిన ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి



ఎస్‌ఐ స్రవంతి, భాస్కర్‌ను సముదాయిస్తున్న ఎమ్మెల్యే ఉపేందర్‌రెడ్డి

నేలకొండపల్లి: నేలకొండపల్లిలో బీఆర్‌ఎస్ కార్యాలయం, ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయ ప్రారంభోత్సవం బుధవారం జరగగా, కార్యక్రమానికి హాజరైన ఎస్‌ఐ స్రవంతి, మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకులు యాతాకుల భాస్కర్ నడుమ వాదోపవాదాలు చోటు చేసుకున్నాయి. ఇదంతా ఎమ్మెల్యే కందాల ఉపేందర్‌రెడ్డి ఎదుటే జరగగా, ఆయన ఇద్దరిని సముదాయించాల్సి వచ్చింది. వివరాలు ఇలా ఉన్నాయి. క్యాంపు కార్యాలయాన్ని ప్రారంభించేందుకు ఎమ్మెల్యే హాజరుకాగా, ఎస్‌ఐ స్రవంతిరెడ్డి ఆధ్వర్యాన బందోబస్తు ఏర్పాటుచేశారు. కార్యక్రమానికి హాజరైన మాదిగ హక్కుల దండోరా వ్యవస్థాపకుడు యాతాకుల భాస్కర్ అక్కడ ఎస్‌ఐని చూడగానే.. సదాశివాపురంలో తన పొలం పంట కాల్వను ధ్వంసం చేసిన ఘటనపై ఎనిమిది నెలల కిందట ఫిర్యాదు చేసినా ఎందుకు పట్టించుకోవడం లేదని ప్రశ్నించారు. ఈ క్రమంలో ఆయన ఎస్‌ఐని ఏకవచనంతో సంబోధించారని సమాచారం. ఈ ఘటనపై భాస్కర్ మాట్లాడుతూ కేసు విషయమై ఆరా తీయడమే కాక తనను స్టేషన్‌కు రమ్మని ఎందుకు పిలిచారని అడిగితే తననే ఏకవచనంతో పిలిచి అవమానించారని, దళిత సర్పంచ్ భర్త, ఓ సంఘం రాష్ట్ర నేత అయిన తనతో దురుసుగా ప్రవర్తించారని ఆరోపించారు. ఎస్‌ఐపై అట్రాసిటీ కేసు నమోదు చేయాలని ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు.

కాగా, ఈ విషయమై ఎస్‌ఐ మాట్లాడుతూ ఎమ్మెల్యే కార్యక్రమంలో విధులు నిర్వర్తిస్తున్న తనతో భాస్కర్ వ్యవహరించిన తీరు బాగాలేదన్నారు. మహిళా అధికారిని ఏకవచనంతో మాట్లాడడమే కాక అసమర్థ అధికారి అని పేర్కొన్నారని, ఈ విషయాన్ని జిల్లా అధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు.